భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0

తణుకు : 35.0 - 24.0

వీళ్లు గల్లంతు



సౌమ్య



అమృత



హరదీప్



చికిత్సపొందుతున్న హరిణి



కన్నీటివాగు : ఒక్కసారి ఉధృతంగా మారి ఐదుగురిని ముంచేసిన జలతరంగిణి వాగు ఇదే..

విషాదయాత్ర

ఎప్పుడూ చదువేనా.. కాస్త మార్పు కావాలనిపించింది.. పచ్చని ప్రకృతి ఒడిలో రోజంతా సేదతీరితే.. మళ్లీ రీఫ్రెష్ అవుతామని అనుకున్నారు.. అనుకున్నదే తడవుగా ఏలూరు ఆశ్రంలో మెడికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది తూర్పు ఏజెన్సీలోని అటవీ ప్రాంతానికి వచ్చారు.. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతం వద్ద ఆగారు. అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తమ స్నేహానికి జీవితంలో గుర్తుండేలా ప్రకృతి అందాలతో కలిసి ఫొటోలను దిగారు. అకస్మాత్తుగా ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షపు నీరు వరదలా మారి క్షణాల్లోనే జలపాతంలోకి రావడం గమనించలేకపోయారు. ఒక్కసారిగా వరద పెరిగి 14మందికి ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరిని మిగతా స్నేహితులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి అతికష్టం మీద కాపాడారు. మరో ముగ్గురు గల్లంత య్యారు. దీంతో వీరి విహార యాత్ర.. విషాదంగా మారింది. ఈ వ్యవహారంలో అటవీశాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు రద్దు చేశారు. అయినా జలతరంగిణి వద్ద అటవీశాఖ సిబ్బంది వీరిని అనుమతించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చూస్తుండగానే ముంచేసిన జలతరంగిణి వాగు

- ఆశ్రం విద్యార్థుల విహారయాత్ర
- కళ్లెదుటే ఐదుగురు గల్లంతు
- క్షణాల్లోనే ఆవిరైన ఆనందం
- ఇద్దరిని కాపాడిన వైనం
- కానరాని ముగ్గురి ఆచూకీ
- చీకటిపడడంతో ఆగిన గాలింపు
- అందరూ మెడికల్ విద్యార్థులే
- మారేడుమిల్లి వద్ద ఘటన
- రెండు రోజులుగా అనుమతుల్లేవ్

మారేడుమిల్లి/ఏలూరు క్రైం, సెప్టెంబరు 22 : వైద్య విద్యార్థుల విహారయాత్ర విషాదంగా మిగిలింది.అప్పటి వరకూ ఎంతో ఆనందం గడిపిన వారంత ఒక్కసారిగా హతాశులయ్యారు. అప్పటి ఎంతో ప్రశాంతంగా ఉన్న వాగు క్షణాల్లోనే ఉధృతంగా మారి తమ కళ్లెదుటే స్నేహితులను ముంచేయడంతో కన్నీటి పర్యంతమయ్యారు.ఏలూరు ఆశ్రం వైద్యకళాశాలలో ద్వితీయ సంవత్సరం మెడికల్ విద్యార్థులు 14 మంది విద్యార్థులు టెంపో ట్రావెల్ బస్‌లో శనివారం రాత్రి విహారయాత్రకు బయలుదేరారు. ఉదయం నుంచి పలు ప్రాంతాలు చూసుకుంటూ మధ్యాహ్నానికి అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని మారేడుమిల్లికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జల తరంగిణీ జలపాతం వద్దకు చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రశాంతంగా కనిపించిన జలపాతంలోకి కొంత మంది స్నానాలకు దిగారు. కొంతమంది ఫొటోలు తీసుకుంటున్నారు. అప్పటికే వర్షం ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షం పడుతోంది. వాగులో ఎర్రరంగు నీరు వస్తున్నా స్నానం చేసేవారికి అర్థం కాలేదు. ఫొటోలు తీసేవారు బురద నీరు వస్తోందని కేకలు వేస్తున్నారు. అయినా జలపాతం శబ్దంలో స్నానాలు చేసే వారు గమనించలేకపోయారు. క్షణాల్లోనే నీరు పెరిగిపోతుండగా వెంటనే కొంతమంది తప్పించుకోగా ఐదుగురు చిక్కుకుపోయారు. వాగు ఉధృతికి ఐదుగురు విద్యార్థులు గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ, కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ కొట్టుకుపోయారు. వీరిలో ఒకరిని స్నేహితులు అతికష్టం మీద కాపాడగలిగారు.ఈలోపు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే రంపచోడవరం అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. కొండలపై నుంచి వర్షపునీరు ఉధృతంగా రావడంతో మిగిలినవారి జాడ తెలియలేదు.కాసేపటికి జలపాతం దిగువన కల్వర్టు వద్ద సిమెంట్ తూరల్లో ఒకరు ఉన్నట్టు గుర్తించి అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కాపాడారు. గాయత్రి ప్రియ, చింతా హర్షిణీలను రక్షించారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట హరదీప్ (20), విజయనగరం జిల్లాకు చెందిన కొనిరెడ్డి సౌమ్య(21), బాలిఅమృత (22) గల్లంతయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పినట్టు సమాచారం. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయగా ..చీకటి పడిపోవడం.. వర్షం పడుతుండడంతో ఆటంకంగా మారాయి. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైద్యవిద్యార్థుల కోసం తమ కళాశాల తరపున ప్రత్యేక బృందాన్ని పంపించామని,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు ఆశ్రం కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

ఆశ్రంలో తీవ్ర విషాదం..

గల్లంతైన వారు ఎక్కడైనా చెట్లను పట్టుకుని బతికి ఉన్నారేమో అనే ఆశతో తోటి విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గల్లంతైనవారిలో చింతపల్లి హరదీప్‌కు బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా పేరుంది. కార్డియాలజీలో ప్రత్యేక వైద్యనిపుణుడిగా పేరు పొందాలనే ఆశయం చదువుతున్నాడు. బాలి అమృత తెలివైన విద్యార్థిని.. డాక్టర్ చదివి పేదల వైద్యురాలిగా పేరు పొందాలనే ఆశయంతోనే ఉంది. కొనిరెడ్డి సౌమ్య మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతోనే చదువును కొనసాగిస్తోంది.ముగ్గురు విద్యార్థులు జలపాతం వద్ద కొట్టుకుపోయారని సమాచారం అందడంతో ఆశ్రం కళాశాలలో విద్యార్థుల్లో తీరని విషాదం నెలకొంది. ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి చెప్పారు.

యాత్రకు వెళ్లింది వీరే..

మొత్తం 14మంది విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. **గల్లంతైన విద్యార్థులు :** కొనిరెడ్డి సౌమ్య(21), బాలి అమృత (22)(విజయనగరం జిల్లా), చింతకుంట హరదీప్(20)(ప్రకాశం జిల్లా మార్కాపురం), **గాయపడినవారు :** దండే గాయత్రి పుష్ప(బాపట్ల), సీహెచ్ హరిణి ప్రియ (విశాఖ జిల్లా మధురవాడ), పొట్లూరి ప్రగ్న (భీమిలి),**మిగిలినవారు :** హిమబిందు(బొబ్బిలి), మేఘన(కర్నూలు), స్వప్న(అనంతపురం), హరినేత్ర(చీరాల), అవినాష్, హరిప్రియ, ధీరజ (రాజమండ్రి),జాగృతి(ద్వారకాతిరుమల)



ఏఎంసీలకు పచ్చ జెండా

- చైర్మన్ పదవిని నిర్ణయించే బాధ్యత ఎమ్మెల్యేలకే
- కూటమి ప్రభుత్వంలో సర్దుబాటు
- జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు అవకాశం
- మరో మూడు నియోజకవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేలదే నిర్ణయం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కమిటీల నియామకం బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఆ దిశగా స్పష్టమైన సంకేతాలు పంపింది. జిల్లాలో తొమ్మిది ఏఎంసీలు ఉన్నాయి. ఉండి నియోజకవర్గ పరిధిలో ఆకివీడు, ఉండి, ఆచంట నియోజకవర్గంలో ఉన్న పెనుగొండ, ఆచంట మార్కెట్ కమిటీలను భర్తీ చేయనున్నారు. ఇక భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురంలో ఒక్కో ఏఎంసీ ఉన్నది. అన్నింటినీ స్థానిక ఎమ్మెల్యేలే భర్తీ చేసే అవకాశం ఉంది. శాసన సభ్యుల సిఫారసుల మేరకే చైర్మన్ పదవికి ప్రభుత్వం ఒకే చేయనుంది. వాస్తవానికి పొత్తులో భాగంగా గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో జనసేన పోటీ చేసి నెగ్గింది. నాలుగు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పాగా వేసింది. దాంతో ఎమ్మెల్యేలకు బదులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంలో ఇతర పార్టీలకు కూటమి ప్రభుత్వం అవకాశం ఇస్తుందన్న భావనతో అంతా ఉన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అయినా కూటమి ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుంటుందని స్థానిక నాయకులు విశ్వసించారు. కూటమి ప్రభుత్వం మాత్రం సర్దుబాటు ధోరణితో వెళ్లింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకంలో ఎమ్మెల్యేల సిఫారసులకే పెద్ద పీట వేసింది. గతంలో తెలుగుదేశం కూటమిగా ఉన్నప్పుడు స్థానిక పరిస్థితులను బట్టి అవకాశం ఇచ్చింది. అందులో భాగంగానే భారతీయ జనతాపార్టీ ప్రాతినిధ్యం వహించిన చోట తెలుగుదేశం నాయకుల సిఫారసుల మేరకు మార్కెట్ కమిటీలు నియామకం సాగాయి. ఈ సారి కూటమి ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యేలకే ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పటికే శాసన సభ్యులు కమిటీ చైర్మన్‌ల విషయంలో కసరత్తు చేసుకుంటున్నారు. ఆశావహులు కూడా తమకే పదవులు వస్తాయంటూ నమ్మకంతో ఉన్నారు.

వైసీపీలో నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏఎంసీలు కేవలం అలంకార ప్రాయంగా మారిపోయాయి. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. పంట రహదారులకు నిధులు కేటాయించలేదు. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే సంస్థలుగానే మిగిలి పోయా యి. మరోవైపు తమ పార్టీలో ఆశావహులకు న్యాయం చేయలేకపోయింది. రిజర్వేషన్‌లు పేరుతో అందరికీ న్యాయం చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకొంది. కానీ చైర్మన్‌లను అలంకార ప్రాయంగా చేసేశారు. అంతే తప్పా రైతులకు ప్రయోజనకరమైన వసతులు కల్పించడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టి సారించింది. ఫలిత ంగా మార్కెట్ కమిటీలపై గట్టి పోటీ నెలకొంది.

డైరెక్టర్ పదవులపై వెసులుబాటు ఉంటుందా..

చైర్మన్‌ల విషయంలో ఎమ్మెల్యేల సిఫారసులకే కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతి ఎమ్మెల్యేకు సమాచారం ఇచ్చింది. అయితే కమిటీలో వైస్‌చైర్మన్‌తోపాటు, డైరెక్టర్‌లు ఉంటారు. వారి విషయంలో నియోజకవర్గంలో ఉండే కూటమి నాయకుల సిఫారసులను పరిగణలోకి తీసుకుంటారా లేదా ఎమ్మెల్యేలకే ఆ బాధ్యతను అప్పగిస్తారా అనేది తేలాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ హయాంలో ఏర్పాటైన కమిటీలను రద్దు చేశారు. ముందుగానే కొన్ని కమిటీలు రాజీనామా చేశాయి. మిగిలిన కమిటీలను ప్రభుత్వమే రద్దు చేసింది. ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించింది. అధికారులను ఇన్‌చార్జిల స్థానంలో నియమించింది. అప్పటినుంచి కూటమిలో నాయకులు చైర్మన్ పదవి కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం సంకేతాలు ఇవ్వడంతో కూటమిలో సందడి నెలకొంది.

మన ఇల్లు మన గౌరవం

- 28న ప్రతి లే-అవుట్‌లోను సదస్సులు
- మార్చిలోగా పేదల ఇళ్ళు పూర్తి చెయ్యాల్సిందే.. లేదంటే కేంద్ర నిధులకు అవరోధం
- జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- మార్చి తరువాత పీఎంఏవై 2.0 అమలు



జిల్లాలో ప్రస్తుత పరిస్థితి ఇది			
మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు	పెండింగ్
ఆకివీడురూరల్	2,199	785	1414
పాలకోడేరు	2585	1104	1481
అత్తిలి	2408	1063	1345
భీమవరంటౌన్	7297	465	6832
తాడేపల్లిగూడెంటౌన్	3826	1570	2256
పెంటపాడు	2446	1468	978
వీరవాసరం	1758	913	845
ఆకివీడుటౌన్	1233	408	825
గణపవరం	1663	1070	593
ఉండి	3040	1505	1535
భీమవరంరూరల్	1969	1235	734
కాళ్ళ	1265	924	341
తాడేపల్లిగూడెంరూరల్	3820	2117	1703
పాలకొల్లు అర్బన్	1101	456	645
నరసాపురంరూరల్	2778	1023	1755
నరసాపురం అర్బన్	2811	755	2056
యలమంచిలి	2478	1520	958
ఆచంట	2741	1423	1318
తణుకు అర్బన్	6383	1275	5108
తణుకు రూరల్	4075	1545	2530
పోడూరు	2978	1494	1484
పెనుమంట్ర	3243	1551	1692
పెనుగొండ	3593	1506	2087
ఇరగవరం	2503	1503	1000
మొగల్తూరు	2289	1439	850
పాలకొల్లురూరల్	1310	942	368
	73,792	31,059	42,733

భీమవరం టౌన్, సెప్టెంబరు 22 : ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పేదల ఇళ్ళ నిర్మాణాన్ని వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చెయ్యాల్సిందే. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లా అధికారులకు బాధ్యతలు అప్పగించింది. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస యోజనపథకం (పీఎంఎవై-1.0) లో భాగంగా రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ళ స్థలాలు మంజూరు చేశారు. కేంద్రం ఇచ్చే నిధులనే తమవిగా గొప్పలు చెప్పుకున్నారు. ఇళ్ల నిర్మాణం మాత్రం సకాలంలో పూర్తి చెయ్యలేకపోయారు. ఇప్పటికి జిల్లాలో పూడిక చెయ్యని లే-అవుట్‌లు దర్శనం ఇస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షలకు చెరువులను తలపించాయి. కూటమి ప్రభుత్వం ఇప్పుడు పీఎంఏవై పథకంలో పేదల ఇళ్ళపై దృష్టిపెట్టింది. గడువులోగా పూర్తి చెయ్యాలని లక్ష్యాలను నిర్ధేశించింది. జిల్లాలో 625 లే-అవుట్‌లు ఉన్నాయి. ప్రతీ లే-అవుట్‌కు ఒక ఇన్‌ర్జిను నియమించారు అక్కడ సాదకబాధలను తెలుసుకుని జిల్లా కలెక్టర్‌కు నివేదకలు ఇవ్వాలి. ఇప్పటికే ఇన్‌చార్జిలతో సమావేశమై వివరాలను రాబట్టారు. మొత్తంమీద ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా 2025 మార్చినాటికి ఇళ్ళు పూర్తిచెయ్యాలనే లక్ష్యంతో కుస్తీపడుతున్నారు మన ఇల్లు- మన గౌరవం పేరుతో లబ్ధిదారులను అవగాహన కల్పించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 28న ప్రతీ లే-అవుట్‌లోను సమావేశం ఏర్పాటు చేస్తారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు.

నిధులకు గండం

ప్రధానమంత్రి ఆవాస యోజనలో పట్టణ పేదలకు గత ప్రభుత్వం సెంటు స్థలం కేటాయించారు. గ్రామీణ ప్రాంతంలో సెంటున్నర స్థలం కేటాయించారు. ఇళ్ళు పూర్తికాకపోతే నిధులకు అవరోధం ఏర్పడే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆదేశించినట్లుగా 2025 మార్చిలోగా పూర్తిచెయ్యాలి. ఆ గడువు దాటితే ఎటువంటి ఆర్థిక సాయం ఉండదు. అంటే కేంద్రం ఇచ్చే రూ.1.80 లక్షలు మంజూరు చెయ్యదు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులకు స్పష్ట చేసింది. అందుకోసమే మన ఇల్లు- మన గౌరవం' పేరుతో అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

మార్చి తరువాత పీఎంఏవై 2.0

కేంద్ర ప్రభుత్వం 2025 మార్చి తరువాత పీఎంఏవై 2.0ను అమలు చెయ్యనుంది. అయితే పీఎంఏవై 1.0లో స్థలాలు తీసుకున్న లబ్ధిదారులకు మళ్ళీ కేటాయించే అవకాశం లేదు. ఉన్న స్థలంలోనే ఇల్లు నిర్మాంచుకోవాలి ఈవిషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రం కూడా పీఎంఏవై 2.0లో రాయితీ పెంచే అవకాశం లేదు. గతంలో మాదిరిగానే రూ.1.80 లక్షలు మాత్రమే మంజూరు చేస్తుంది. అయితే లబ్ధిదారులకు మరో అవకాశం కల్పించారు. మార్చి తరువాత ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ, ప్లాస్టింగ్, మరుగుదొడ్ల నిర్మించుకునే అవకాశం ఇస్తున్నారు. మిగతా నిర్మాణం మార్చి నెలాఖరులోగా పూర్తిచేసుకోవలసి ఉంది. దీనిపై లబ్ధిదారులకు ఈనెల 28న నిర్వహించే సదస్సులో అవగాహన కల్పించనున్నారు.

సదస్సు భాగస్వాములు వీరే..

మనఇల్లు- మన గౌరవం పేరిట ఈనెల28న నిర్వహించే సదస్సుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. అలాగే లే-అవుట్ ఇన్‌ఛార్జులు, హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ సంక్షేమ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొంటారు. లే-అవుట్‌లో మౌలిక వసతులు కల్పించే విద్యుత్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు భాగస్వాములు కానున్నారు. జిల్లాలో ఆదిశగా జిల్లా ప్రణాళిక సిద్ధంచేస్తున్నారు. ఈనెల 24న మండల స్థాయిలో సమావేశం ఉంటుంది. అక్కడే సిబ్బందికి ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తారు.

పెండింగ్ లే-అవుట్‌లు ఎలా..?

భీమవరం,తణుకు నియోజకవర్గల్లో లే-అవుట్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పూడిక చెయ్యలేదు. మళ్ళీ టెండర్లు పిలవనున్నారు. లబ్ధిదారులకు స్థలాలను కేటాయించనున్నారు. తరువాత నిర్మాణాలు చేపడతారు. మరోవైపు వైసీపీ ప్రభుత ్వం కాంట్రాక్టుల ద్వారా నిర్మాణం చేపట్టారు. మధ్యలోనేవారు చేతులు ఎత్తేశారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉంది.

డీపీవో బదిలీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 22 : జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్‌కు బదిలీ అయింది. ఈయన స్థానంలో విజయనగరంలోని డ్వామాలో పనిచేస్తున్న అరుణ శ్రీని ఇక్కడకు బదిలీ చేశారు.

ఎంపీడీవోల బదిలీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22: పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న 10 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సాధారణ బదిలీల్లో భాగంగా కృష్ణా, తూర్పుగోదావరి, ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లాకు కేవీ ప్రసాద్, ఎస్.శ్రీనివాసదొర, కృష్ణా జిల్లాకు బి.ప్రణవి, జి.శ్రీను, ప్రకాశం జిల్లాకు జీఏకేఎన్‌వి జ్యోతిర్మయి, శ్రీకాకుళం జిల్లాకు ఆర్.తిరుపతిరావు, పి నరసింహప్రసాద్, విశాఖ జిల్లాకు రాతన్, పి.పద్మజలు బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఎంపీడీవోలు ఆయా జిల్లాల్లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

25 నుంచి కాళ్ళకూరు వెంకన్న పవిత్రోత్సవాలు

కాళ్ళ, సెప్టెంబరు 22 : కాళ్ళకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి సప్తనదీ జలాభిషేకాలు, పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. పవిత్రోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి, సరస్వతి, యమునా, గంగా, కృష్ణా, కావేరి, నర్మదా నదుల నుంచి సేకరించిన జలాలతో స్వామివారికి అభిషేకం చేస్తామన్నారు. దీనిలో భాగంగా 25వ తేదీ నుంచి స్వామివారికి విశ్వక్సేన పూజ, దీక్షాదారణ, అకుంరార్పణ, యాగశాలార్చన, హోమాలు నిర్వహించన్నుట్లు తెలిపారు. 28న స్వామివారికి హోమాలు సప్తనదీ జలాభిషేకాలతో పాటు శాంతి కళ్యాణం నిర్వహిస్తామన్నారు.



పాలకొల్లులో ఆందోళన చేస్తున్న హిందూ సంఘాలు

తిరుమల లడ్డూ అపవిత్రతపై ఆందోళన

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు, 22 : తిరుమలలో శ్రీవారికి నివేదించే లడ్డూల తయారీకి జంతువుల కొవ్వును వాడారన్న ఆరోపణల నేపథ్యంలో ఆదివారం పట్టణంలో హిందూ సంఘాలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఈసందర్భంగా కాషాయ జెండాలతో గోవింద నామాలు జపిస్తూ పట్టణంలోని బుధవారం వీధి, రామాలయం వద్ద నుంచి కెనాల్ రోడ్డు గాంధీ బొమ్మల సెంటర్ వరకూ ప్రదర్శన జరిగింది. లడ్డూ ప్రసాదాల అపవిత్రతకు మాజీ సీఎం జగన్ బాధ్యత వహించాలంటూ దిష్టిబొమ్మన దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. లడ్డును అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తాడేపల్లిగూడేనికి క్రికెట్ స్టేడియం

- నెరవేరనున్న క్రీడాకారుల కల



స్టేడియం నిర్మాణం చేయనున్న క్రీడా స్థలం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22: తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే క్రీడాకారులు, ముఖ్యంగా వాకర్స్ ఉపయోగిస్తున్న నన్నయ యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ప్రాంతం 9 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలానికి ప్రభుత్వ అనుమతి కోసం పంపేందుకు సిద్ధం చేస్తుండగా అది లాంఛనమే. ఏళ్ల తరబడి తాడేపల్లిగూడెం ప్రాంత వాసులు ఎదురు చూస్తున్న క్రికెట్ స్టేడియం కల నెరవేరనుంది. ప్రజల కోసం ముఖ్యంగా యువత, క్రీడాకారుల అవసరం గుర్తించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్టేడియం ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జిల్లా కలెక్టర్‌కు స్థలాన్ని చూపించి స్టేడియం ఏర్పాటుకు ముందడుగు వేశారు. అనుమతులు రాగానే అవసరమైతే దాతల సహకారంతో స్టేడియం నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌ఫూల్‌ల నిర్మాణం ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని పూర్తి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. వాటితోపాటు తాజాగా క్రికెట్ స్టేడియంకు స్థలకేటాయింపు జరగడంతో క్రీడా ప్రేమికులకు స్వర్ణయుగం కానుందని క్రీడాభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఈ-క్రాప్ విధానం పరిశీలిస్తున్న జేసీ

ఈ-క్రాప్ పూర్తిచేయాలి: జేసీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22: ఈ క్రాప్ త్వరితగతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని చినతాడేపల్లి, కృష్ణాయపాలెం గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. రైతు భరోసా కేంద్రాలు పరిశీలించి రైతులకు అందుతున్న సేవలను సమీక్షించారు. అనంతరం ఈ క్రాప్ విధానం పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 22 : మన్యం బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.వర్షాలు కురవకపోవడంతో వాతావరణం పొడిగా ఉండటంతో భక్తులు తరలివచ్చారు. దర్శనానికి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వాతావరణశాఖ హెచ్చరికలతో సాయంత్రం 3 గంటల కల్లా పనులు ముగించుకుని వెళ్లాలని ఆలయ కమిటీవారు చెప్పడంతో భక్తులు త్వరగా మొక్కుబడులు తీర్చుకుని స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు.



స్టాంపులు, నాణేల ప్రదర్శన ప్రారంభిస్తున్న డాక్టర్ బాబ్జీ..ప్రదర్శనలో ఆకర్షణీయంగా ఉన్న కిలో వెండి నాణెం

సంస్కృతికి చిహ్నాలు నాణేలు.. స్టాంపులు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు, 22 : జాతీయతకు, సంస్కృతికి ఆయా కాలాలను గుర్తు తెచ్చేవి నాణేలు, స్టాంపులు అని లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) అన్నారు. లయన్స్ క్లబ్‌హాల్లో యూత్ హాస్టల్స్, లయన్స్ క్లబ్ ఆదివారం ఏర్పాటు చేసిన స్టాంపులు, నాణెముల ప్రదర్శనను బాబ్జీ ప్రారంభించారు. రెండురోజులు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకుడు, యూత్ హాస్టల్స్ పాలకొల్లు శాఖ చైర్మన్ కారుమూరి సూర్యనారాయణ తెలిపారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 మంది స్టాంపులు, నాణెములు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు ప్రదర్శించారు. పాలకొల్లు శాఖ అధ్యక్షుడు పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ బీహెచ్ అచ్యుత రామరాజు, శ్రీకాకొల్లు కామేశ్వరరావు, సత్యనారాయణ మూర్తి, లయన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ జయభారత రెడ్డి, కెజి భీమేశ్వరరావు, కొట్టు భాస్కరరావు పాల్గొన్నారు.



38 సంవత్సరాల తర్వాత కలసిన విద్యార్థులు

పెంటపాడు పోస్ట్ బేసిక్ పాఠశాలలో అపూర్వ సమ్మేళనం

పెంటపాడు, సెప్టెంబరు 22: మండల కేంద్రమైన పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలలో 1986-87 సంవత్సరంలో విద్యనభ్యసించిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 38 సంవత్సరాల తరువాత కలసిన వీరంతా కుటుంబాలతో హాజరై తాము చదువుకున్నప్పటి సంగతులను గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులు కృష్ణశాస్త్రి, రామారావులను ఘనంగా సత్కరించారు. ఏర్పాట్లను పూర్వవిద్యార్థులు కోదండరావు, రాజశేఖర్, మురళీ మోహన్‌రెడ్డి, శ్యాంప్రకాష్, ఉషాలక్ష్మి, వసంతలు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా స్వామి మాస్టారు



కాళ్ళ, సెప్టెంబరు 22 : ఈ- కంటెంట్ రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా సీసలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి ఎంపికయ్యారని ఎంఈవో రవీంద్ర ఆదివారం తెలిపారు. సీఐఈటీ - ఎన్‌సీ ఈఆర్‌టీ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్ (ఎస్ఆర్‌జి)గా ఎంపిక చేసి వారికి రెండు బ్యాచ్లలో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా రెండవ ఫేజ్‌లో 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన 20 మందిలో ఈయన ఉన్నారు. ఈ కంటెంట్‌లో భాగంగా 3వ తరగతి గణితమునకు సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపీ ఈ పాఠశాల ఆప్, ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో పొందుపరిచినట్టు స్వామి మాస్టారు తెలిపారు. ఎంఈవో-2 వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



కొల్లేటికోట రోడ్డులో కోతకు గురైన ప్రదేశాల్లో గ్రామస్థుల మట్టి తోలకం

రోడ్డు కోసం కలిసికట్టుగా..

» రూ.28 లక్షలు సేకరించిన కొల్లేరు లంక వాసులు

కైకలూరు, సెప్టెంబరు 22: ఇటీవల కొల్లేరు వరద ఉధృతితో లంక గ్రామాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ రోడ్ల మరమ్మతులకు లంక గ్రామాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి విరాళాలను సేకరించారు. కైకలూరు మండలంలోని పెంచికలమర్రు, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు గ్రామాల్లో సుమారు 8వేల మంది ఓటర్లు నివశిస్తున్నారు. ఒక్కొక్క ఓటరు 300 చొప్పున రూ.24 లక్షలు విరాళాలను సేకరించారు. మూడు గ్రామాల ప్రజలకు సం బంధించిన రహదారి ఆలపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు, గోకర్ణపురం నుంచి పైడిచింతపాడు వెళ్లే రహదారిలో అనేకచోట్ల వరద ఉధృతికి గండ్లు పడ్డాయి. మూడు గ్రామాల ప్రజలు కలిసిగట్టుగా మరమ్మ తులు నిర్వహించుకునేందుకు ఆలోచన చేశారు. వీరి ఆలోచనను రాష్ట్ర వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వీరిద్ద రూ చెరో రూ.2 లక్షలు చొప్పున అందించారు. మరో ఇద్దరు వ్యక్తులు రూ.15 వేలు విరాళం ఇచ్చారు. మొత్తం రూ.28 లక్షల 15 వేలతో రోడ్లు మరమ్మతులు చేపట్టనున్నారు. భీమవరానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు ఈ సొమ్మును అందించి త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు ఏసురాజు తెలిపారు. కాగా ఆదివారం గోతుల్లో కొంత మట్టిని తోలి తాత్కాలికంగా రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకున్నారు.

టీచర్ అదృశ్యం .. కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22 : ఒక ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తున్న టీచర్ అదృశ్యం అయిందని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు చాటపర్రు రోడ్డులో నివాసం ఉంటున్న నిమ్మగడ్డ నాగేశ్వరరావు లింగపాలెం మండలం నడిపల్లిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య ఏలూరు చాటపర్రు రోడ్డులోని ప్రైవేటు స్కూలు టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె రెండు రోజుల క్రితం నుంచి కనిపించడం లేదని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల జాతర

జడ్పీలో వివిధ కేడర్లకు సంబంధించి 429 మంది

పది మంది ఎంపీడీవోలు ఇతర జిల్లాలకు..

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు కూడా పూర్తి

ఏలూరుసిటీ, సెప్టెంబరు 22: ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 36 రోజుల పాటు కొనసాగిన బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. జిల్లాలో ఎక్సైజ్ శాఖ మినహాయించి మిగిలిన ప్రభుత్వ శాఖలకు సంబంధించి బదిలీల ప్రక్రియ పూర్తయింది. కొన్ని శాఖలకు సంబంధించి ఇప్పటికే బదిలీ ఉత్తర్వులు ఆయా శాఖాధిపతులు అందజేయగా జిల్లా పరిషత్‌కు సంబంధించి ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులను జడ్పీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17వ తేదీన ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేసినందున ఈ బదిలీల కార్యక్రమం చేపట్టారు. జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని అన్ని కేడర్లలో 429 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఇక అంతర జిల్లా బదిలీలకు సంబంధించి ఈ జిల్లా నుంచి 10 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. పంచాయతీ శాఖకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, పంచా యతీ కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది బదిలీల ప్రక్రియ కూడా పూర్తయిందని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు రాఘవులు పాల్గొన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవో, డీపీవో బదిలీ

జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావును బదిలీ చేస్తూ రిట్రైన్ ఆర్డరు ఇచ్చారు. అంటే ఆయన ఇక్కడే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈవోగా కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమ జిల్లాలో డ్వామా డీవీవోగా పనిచేస్తున్న భీమేశ్వర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. ఇక్కడ డిప్యూటీ సిఈవోగా పనిచేస్తున్న నిర్మలా జ్యోతిని బదిలీ చేశారు. ఏలూరు జిల్లా డీపీవోగా పనిచేస్తున్న తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను బదిలీ చేశారు. విజయవాడలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్న కె.అనూరాధను ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిగా నియమిస్తూ బదిలీ ఉత్వర్వులు జారీ చేశారు.

ఏలూరు జిల్లా డ్వామా పీడీగా పని చేస్తున్న ఎ.రామును అడిషినల్ పీడీ, ఈజీఎస్ , కృష్ణా/ ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. విజయవాడ స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న కేవీ సుబ్బారావును ఏలూరు డ్వామా పీడీగా నియమితులయ్యారు. ఏలూరు జిల్లాలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.హిమశైలజను గుంటూరు డీఎఫ్‌వో(టి)గా బదిలీచేశారు. చింతపల్లి టెరిటోరియల్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న సీహెచ్ సూర్యనారాయణను ఏలూరు జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీసీఎంస్ మేనేజర్‌గా వి.శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఈమె విజయవాడలో మేనేజర్(స్టోర్స్)గా పనిచేస్తున్నారు. ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వి.సురేంద్రబాబు నియమితులయ్యారు.

సిఫార్సులకే ప్రాధాన్యం

సాధారణంగా గతంలో ఎటువంటి సిఫార్సు లేకుండానే బదిలీల ప్రక్రియ నిర్వహించేవారు. కానీ ఈసారి ప్రజాప్రతినిధుల సిఫార్సులకే బదిలీలలో ప్రాధాన్యం కల్పించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు సిఫార్సులు చేసిన వారికే ఈ బదిలీల ప్రక్రియలో ప్రాధాన్యం లభించినట్టు సమాచారం.



జడ్పీ ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మ[illegible]





సెపక్ తక్రా పోటీల్లో విద్యార్థులు.. ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీలు, పీఈటీలు

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశించేవి క్రీడలు

పెదవేగిలో 19 ఏళ్ల విభాగం స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

పెదవేగి, సెప్టెంబరు 22 : విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశించేవి క్రీడలని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదొక క్రీడలో ప్రావీణ్యత సాధించాలని పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వైవీఎస్ ఆచార్యులు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 19 ఏళ్ళ విభాగం క్రీడాపోటీలు పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయికి జిల్లాజట్లను ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయ రాజు తెలిపారు. కుస్తీపోటీల్లో బాలురు 20 మంది, బాలికలు పదిమందిని ఎంపిక చేశా మన్నారు. సాఫ్ట్‌బాల్ విభాగంలో 16 మంది బాలురు, 16 మంది బాలికలు, బేస్‌బాల్‌లో 16 మంది బాలురు, 16 మంది బాలికలు ఎంపికయ్యారని చెప్పారు. సెపక్‌తక్రా పోటీల్లో బాలబాలికలు ఐదుగురు చొప్పున ఎంపికయ్యారని, త్రోబాల్‌లో 12 మంది బాలురు, యోగాలో ముగ్గురు బాలురు ఎంపికయ్యారని జయరాజు తెలిపారు. పీడీలు, పీఈటీలు గురుమూర్తి, విజయలక్ష్మి, రాజా, శ్రీనివాస్, కుమార్, సునీల్, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జిల్లా జట్ల ఎంపికలు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2024-25 విద్యా సంవత్సరానికి అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు నెట్ బాల్‌కు ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ పిఎస్ఎన్ మల్లేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన జడ్పీహెచ్ గొరగనమూడి, సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ క్రీడలకు ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ పెదవేగి, 26వ తేదీన రీఫిల్ షూటింగ్ ఎస్‌సీహెచ్‌బీఆర్ఎంహెచ్ఎస్ భీమవరం, మోడరన్ పెంటాత్లాన్ బెల్‌వెదర్ స్కూల్, తణుకు, 28న బాస్కెట్ బాల్ క్రీడకు ఎస్‌వీజీ జడ్పీహెచ్ఎస్ మార్టేరు, 30న రగ్బీ ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ ఎటిచర్ల, అక్టోబరు 1వ తేదీన మల్కంబ్, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడలకు ఎస్‌సిహెచ్‌బీఆర్ఎంహెచ్ఎస్ భీమవరం, ఫెన్సింగ్‌కు జడ్పీహెచ్ఎస్ శృంగవృక్షం, బాక్సింగ్‌కు జడ్పీహెచ్ఎస్ పెనుమంట్రలో జిల్లా జట్లు ఎంపికలు నిర్వహిస్తున్నారన్నారు. పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారం, మిడ్‌డే మీల్స్ ఎక్విటెన్స్ తప్పనిసరిగా తీసుకురావాలని మల్లేశ్వరరావు పేర్కొన్నారు.

అండర్-14 బాలుర క్రికెట్ టీమ్ ఎంపిక

ఏలూరురూరల్, సెప్టెంబరు 22: వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు ఆశ్రం మెడికల్ కళాశాలలో నిర్వహించారు. పీవీఎస్ రేవంత్‌వర్మ, కే.పీ.నారాయణ, కేబీఎస్ సుబ్బారాయుడు, జీ.గౌతమ్‌రాజ్, వీసీహెచ్.నాగగణేష్, ధీరజ్ నాయుడు, కుండ్యాజైన్, మణికంఠ, టీడీ వెంకటేశ్వరరావు, టీ.రిత్విక్ రెడ్డి, ఎన్.కార్తీక్‌వర్మ, మనోజ్‌కుమార్, జైవాన్స్, జీ.జితేష్, నాగసాయిలక్ష్మణ్, గౌతమ్, పార్థసారధి, అజిత్, కార్తికేయ, కౌశిక్‌రాయుడు, కే.పృథ్వీరాజ్, అల్తాఫహ్మద్, ఎస్.సూర్యతేజ, కే.భరత్ అవినాష్‌లను ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు జీ.ఆదిత్యవర్మ, కార్యదర్శి శ్రీనివాసరాజు తెలిపారు. అక్టోబరు 4వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కడపలో జరిగే ఏసీఏ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు.



ఎంపికైన క్రికెట్ జట్టు సభ్[illegible]





నిర్మాణుషంగా మారిన భీమవరం ప్రధాన సెంటర్... ఆకివీడులో చెరువు గట్టున సేద తీరుతున్న జనం

భగ్గుమన్న సూరీడు.. వేడి గాలులతో జనం అవస్థలు

భీమవరంటౌన్/ఆకివీడు సెప్టెంబరు 22 : సూర్యుడి ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. వేసవిని తలదన్నే విధంగా ఎండలు మండిపోతున్నాయి. ఇది వర్షాకాలమా లేక వేసవి కాలమా అని అంటున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. ఇళ్ళలో ఉన్నా ఏసీలు వేసుకుని కూర్చోవలసిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. రెండు రోజుక్రితం అకస్మాత్తుగా వాతావరణం మారి ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు మాత్రం 34 డిగ్రీలే ఉన్నా ఎండ మాత్రం 45 డిగ్రీల తీవ్రత ఉన్నట్లు కనిపిస్తోంది.దీంతో ప్రజలు భయటకు రావాలంటే భయ పడు తున్నారు. ఆదివారం వస్తే భీమవరం పట్టణంలోని గ్రౌండ్‌లు పిల్లల ఆటలతో సందడిగా ఉంటే నిర్మానుష్యంగా మారాయి. వాతావరణ మార్పులతో రోగాలు కూడా వెంటాడుతున్నాయంటున్నారు. జ్వరాలు తగ్గడం లేదని, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు అనంతరం ఎండలు పెరిగిపోయాయని అంటున్నారు. భానుడు ఉగ్రరూపం దాల్చుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా ఆకివీడు వరద ముంపు ప్రాంతాల్లో నీరు ఇంకా తగ్గముఖం పట్టడం లేదు. మరోవైపు జనం విష జ్వరాలతో అల్లాడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రైమ్ కార్నర్

చికిత్సపొందుతున్న బాలుడి మృతి

ఉండి సెప్టెంబరు 22: మోటర్ సైక్లిస్ట్ ఢీకొట్టిన ప్రమాదంలో బాలుడు తలకు తీవ్రమైన గాయమై చికిత్స పొందుతున్న బాలుడు శనివారం రాత్రి మృతి చెందినట్టు ఉండి ఎస్ఐ మహమ్మద్ నజీరుల్లా తెలిపారు. ఉప్పులూరు గ్రామంలో ఈనెల 20వ తేదీ శుక్రవారం ఉదయం కొల్లి రక్షణబాబు(9) కొత్త చర్చి ఎదురుగా రోడ్ మీద వుండగా బాలుడిని వెనుకవైపు నుంచి వచ్చిన మోటర్‌సైక్లిస్ట్ బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగి వచ్చి కోర్టులో హడావుడి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 22 : ఒక హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి కోర్టు వాయిదాకు మద్యం తాగి వచ్చి కోర్టులో హడావుడి చేయడంతో కోర్టు ఉత్తర్వులు మేరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో ఏలూరు వన్‌టౌన్‌లోని ఒక హత్యకేసులో నిందితుడిగా ఉన్న ఏలూరు తూర్పువీధినకు చెందిన తిరుమల రామశివ (38) ఏలూరు జిల్లా కోర్టుకు కేసు వాయిదాలకు వస్తున్నాడు. ఈనెల 13వ తేదీన కోర్టు వాయిదాకు వచ్చిన అతను మద్యం తాగి కోర్టులో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కోర్టు అదేశాల మేరకు ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఉత్తర్వులు జారీ కావడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

బొర్రంపాలెంలో 12 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

టి.నర్సాపురం, సెప్టెంబరు 22 : కులం పేరుతో దూషించిన పన్నెండు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలెంలో ఓ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా సోషల్ మీడియాలో శనివారం పోస్టు పెట్టడంతో ప్రశ్నించిన గుండె నాగేంద్రతో పాటు మరికొందరిని దూషించారు. బాధితుల ఫిర్యాదుతో తోట ప్రసాద్, సూరితో పాటు మరో పదిమందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చించినాడలో ఆరుగురిపై కేసు..

యలమంచిలి, సెప్టెంబరు 22: మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన కానేటి బాలరాజును కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గుర్రయ్య తెలిపారు. ఈనెల 19వ తేదీన కానేటి బాలరాజు తన పట్టాభూమి(లంకభూమి) వద్దకు వెళ్లగా అదే ప్రాంతంలో ఉన్న ఆరుగురు వ్యక్తులు తనను కులం పేరుతో దూషించారని బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్టు

పెనుగొండ, సెప్టెంబరు 22 :పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. పెనుగొండ మండలం చెరుకువాడ బర్రింకలాంబ గుడి సమీపంలో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో 9 మందిని అదుపులోకి తీసుకుని 54, 600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి పొదల్లోకి..



జీలుగుమిల్లి, సెప్టెంబరు 22 : దర్భగూడెం వద్ద జాతీయ రహదారిపై కారు బైక్ ఢీకొన్న ఘటన ఆదివారం జరిగింది. అప్పలరాజుగూడెంకు చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో బైక్‌పై వస్తున్నారు. దర్భగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ఎదు రుగా వస్తున్న వాహనాన్ని చూడ కుండా కారును ఢీకొట్టారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించ బోయిన కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకుపోయింది. కారులో మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన మహిళను జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిదొర

'పది' పరీక్షల మాధ్యమంపై స్పష్టతనివ్వాలి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22 : విద్యా సంవత్సరం ప్రారంభమై తొలి త్రైమాసికం పూర్తయినప్పటికీ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న బాలబాలికలకు తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాసే అవకాశం ఉందో, లేదో ప్రభుత్వం ఇంతవరకు స్పష్టత నివ్వకపోవడం శోచనీయమని ఆదివారం ఏలూరులో జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మాట్లాడుతూ పాఠ శాల విద్యారంగంలో గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న పలు వివాదాస్పద నిర్ణయాలు, జీవోలు, టీచర్ల సమస్యలపై కూటమి ప్రభుత్వం వెంటనే సమీక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా 40 కిలో మీటర్లకు పైబడి చేసిన వర్క్ అడ్జస్ట్‌మెంట్లను రద్దుచేసి, సంబంధిత పాఠశాలలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయా లని కోరారు. జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఈలోగా మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని కోరారు. పెండింగ్ పీఆర్సీ బకాయిలను, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైస్కూల్ ప్లస్‌లకు సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ యాజమాన్యంలోని ఆశ్రమ పాఠ శాలలకు రెండో ఇంగ్లీషు టీచరు పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు శ్యాంసుందర్, దొరబాబు, ప్రకాష్‌రావు, రమాదేవి, భాస్కరవర్మ, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరుపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన

అంబేడ్కర్ ఫ్లెక్సీ వివాదంపై దళితుల రాస్తారోకో

కాళ్ళ, సెప్టెంబరు 22 : అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగింపుపై పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో దళిత సంఘాలు భగ్గుమన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున దళిత నాయకులు చేరుకుని రాష్ట్రీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ట్రిబుల్ ఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ఏలూరుపాడులో దళిత నాయకులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై 24 గంటల్లో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ ఫ్లెక్సీ నిజంగా గుడికి అడ్డుగా ఉంటే అధికారులతో చెప్పి తొలగించవచ్చని దౌర్జన్యంగా ఫ్లెక్సీని తొలగించడం పద్ధతి కాదన్నారు. సుమారు మూడు గంటల పాటు రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

సోషల్ మీడియాలో అవాస్తవ ప్రచారం : ఎస్పీ

ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఘటన ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాలలో వైరల్ చేస్తున్న వీడియో అవాస్తవమని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలియజేశారు. సామాజిక మాధ్యమాలలో అవాస్తవాలను ప్రచారం చేయడం, కుల, ప్రాంత, వర్గ విబేధాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం, వాటిని షేర్ చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. అవాస్తవ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసువారికి తెలియజేయాలని తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

భర్త ఎదుటే భార్య,కుమార్తె కిడ్నాప్

ముదినేపల్లిలో సినీ ఫక్కీలో ఘటన

ముదినేపల్లి, సెప్టెంబరు 22 : భర్తతో కలసి బస్సులో వేరే రాష్ట్రానికి వెళ్తున్న ఓ వివాహితను, ఆమె పదినెలల చిన్నారితో సహా కిడ్నాప్ చేసిన ఘటన శనివారం రాత్రి ముదినేపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన కుమార్తెను కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేసింది. వారికి పది నెలల పసిపాప ఉంది. కొద్ది రోజుల క్రితం రాయచూర్ నుంచి ఆమె తన భర్త, కుమార్తెతో కలసి పుట్టింటికి వచ్చింది. తిరిగి ఈ నెల 21వ తేదీ రాత్రి రాయచూర్ వెళ్లేందుకు ముదినేపల్లిలో బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కారు. అయితే గ్రామానికి చెందిన అచ్యుత రమేష్ అనే యువకుడు బస్ స్టేషన్‌కు వచ్చి 'రాత్రి సమయంలో ప్రయాణం చేయ వద్దని మీ అమ్మ మిమ్మల్ని ఇంటికి తీసుకురమ్మని తనను పంపింద'ని చెప్పగా, వారు బస్సు నుంచి దిగిపోయారు. బైక్‌పై ఆమె తన చిన్నారితో సహా ఎక్కిన అనంతరం ఆమె భర్త ఎక్కుతుండగా, రమేష్ స్పీడ్‌గా వెళ్లిపోయాడు. విషయాన్ని అల్లుడు తన అత్తకు తెలియజేయగా ఆమె ఆదివారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో రమేష్ అనే వ్యక్తి తన కుమార్తెను, మనుమరాలిని కిడ్నాప్ చేశాడని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.


అత్తిలిలో కూటమి నాయకుల రాస్తారోకో

కల్తీ నెయ్యిపై కూటమి ఆగ్రహం

అత్తిలి/గణపవరం/ఆకివీడు రూరల్, సెప్టెంబరు 22 : తిరుమల లడ్డూకు వాడే నెయ్యి కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అత్తిలిలో కూటమి నాయకులు ఆందోళన చేశారు. అత్తిలి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. గత ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాలం మహేష్, జనసేన మండల అధ్యక్షుడు దానం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే తిరుమల లడ్డూ వివాదంపై సీబీఐతో విచారణ జరిపించాలని గణపవరం మండలం పిప్పర పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు డిమాండ్ చేశారు. శ్రీవారి ఆలయంలో కల్తీ నెయ్యి వాడకంపై బాధ్యులతోపాటు, టీటీడీ బోర్డు, అధికారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఉండి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కోరా రామ్మూర్తి డిమాండ్ చేశారు.

లడ్డూ కల్తీ చేసిన వారిని అరెస్ట్ చేయాలి

▸▸ భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

భీమవరంటౌన్, సెప్టెంబరు 22 : తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంలో నెయ్యిని కల్తీ చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఫిర్యాదు చేసిన భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. ఆదివారం సీఐ కాళీచరణ్, ఎస్ఐ రెహమాన్‌కు టీడీపీ భీమవరం సీనియర్ నాయకుడు నందమూరి యువసేన జిల్లా అధ్యక్షుడు చిరుకూరి రామకృష్ణ చౌదరి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతిన్న నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, జేఈవో ధర్మారెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకుని వారిని అరెస్టు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అరెస్టుల ద్వారా హిందువుల మనోభావాలు కాపాడాలని కోరారు. ఆయనతో పాటు పెద్దిరాజుపాలెం సోమరాజు, వీరవల్లి భార్గవ్, నాగబాబు, గౌరు నాయుడు, వలవల గోపి, లాయర్ నరేశ్ తదితరులు ఉన్నారు.

సంచార శకటంతో వైద్య సేవలు

తణుకు, సెప్టెంబరు 22: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులకు ఆదివారం ఇంటింటికి వెళ్ళి డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్రలు వైద్య సేవలు అందజేశారు. తణుకు, పైడిపర్రు, పాలంగి గ్రామాల్లో పర్యటించి 8 మందికి సేవలందించారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి అర్ధి భాస్కరరావు, సభ్యులు గిరజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాపాడుకుందాం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22: త్యాగాలతో సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు కార్మికులు పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం షాదీఖానాలో ఆదివారం నిర్వహించిన ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్యనాయకుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్మిక రంగంలో ఐఎఫ్‌టీయూ కర్తవ్యాలు, నిర్మాణం, పని విధానం అనే అంశాలపై వివరించారు. జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకట్రావు, ఉపాధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్, కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ తదితరులు మాట్లాడారు.

సొంత ట్రాక్టర్‌తో చెత్త తరలించిన సర్పంచ్


చెత్తను తరలించేందుకు సొంత ట్రాక్టర్‌ను ఉపయోగిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

పెంటపాడు, సెప్టెంబరు 22: కోరుమిల్లిలో ఇంటింటికి వెళ్లి చెత్తను తరలించేందుకు పంచాయతీ రిక్షాలు చాలకపోవడంతో సర్పంచ్ గారపాటి భాస్కరరావు చెత్తను తరలించేందుకు తన సొంత ట్రాక్టర్‌ను అందుబాటులో ఉంచి ఉదారత చాటు కున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కరరావు మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా ఉన్నంత కాలం తన ట్రాక్టర్‌తో చెత్తను సేకరిస్తామన్నారు. ప్రభుత్వం సహకరించి తమ గ్రామానికి చెత్త సేకరణకు ట్రాక్టర్ ను అందజేయాలని కోరారు. టీడీపీ నాయకులు పిచ్చుకల వెంకటేశ్వరరావు, పుట్టా ప్రసాద్, ఉండవల్లి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామ క్షమాపణ చెప్పాలి

భీమవరం అర్బన్, సెప్టెంబరు 22 : కాళ్ళ మండలం ఏలూరు పాడు గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు పేకేయడాన్ని ఖండిస్తున్నామని, దళిత ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని జాతీయ దళిత నేత జీవీ హర్షకుమార్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. బహిరంగ క్షమాపణ చెప్పని పక్షంలో ఛలో ఏలూరుపాడు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని రూరల్ సీఐకు దళిత సంఘనాయకులు వినతి పత్రం అందించారు. దళిత నాయకులు గంటా సుందర్ కుమార్, నగేష్, తాళ్ళూరి మధు, పాలపర్తి జోనా, తదితరులు పాల్గొన్నారు.

● ఉండి : ఫ్లెక్సీ తొలగింపును రాజకీయం చేయొద్దు అని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నంశెట్టి హరినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భీమవరంలో వెంకట్రామయ్య సేవలు కీలకం

భీమవరంటౌన్, సెప్టెంబరు 22 : భీమవరం మునిసిపల్ కార్యాలయంలో వెంకట్రామయ్య విగ్రహం వద్ద సుందరీ వనం నిర్మాణానికి నిధులు అందించేందుకు వారి కుటుంబ ముందుకు వచ్చారు. నాచు వెంకట్రామయ్య జయంతి కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కుమారులు నాచు మురళీ, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నిజాయతీకి మారుపేరుగా వెంకట్రామయ్య ఆరు దశాబ్దాలు ప్రజా సేవలో జీవితం గడిపారని అన్నారు. అనంతరం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం అభివృద్ధిలో వెంకట్రామయ్య సేవలు కీలకమన్నారు. రాష్ట్ర మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరంటౌన్, సెప్టెంబరు 22 :** ఎన్ఎస్ఎస్ మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఏర్పడిందని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవలో ముందుండాలని భీమవరం బీవీ రాజు పార్కు ఆవరణలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ మాజీకో ఆర్డినేటర్ డాక్టర్ నిట్టల కిరణ్ చంద్ర అన్నారు.
- **తాడేపల్లిగూడెం అర్బన్ :** రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో వున్న వెంకటలక్ష్మికి గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ట్రస్టు ఫౌండర్ త్రికాల దాతల సహకారంతో ఆ మహిళకు ఆరు నెలలకు నెలకు రూ. 4 వేలు చొప్పున అందించేందుకు ముందుకు వచ్చారు.
- **మొగల్తూరు :** ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మాజీ ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకుడు సుంకర రంజిత్‌కుమార్ అమ్మవారికి మొక్కుబడి చెల్లించి ఆలయం వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్నా, పాల్గొన్నారు.
- **నరసాపురం రూరల్ :** ఎల్‌బీచర్ల గ్రామంలో నియోజకవర్గ స్థాయిలో 24న బాలురు, 25న బాలికలకు వివిధ క్రీడలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. నరసాపురం, మొగల్తూరు మండలాలతో పాటు గురుకుల, ఎయిడెడ్, ప్రైవేట్ స్కూళ్ళ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనవచ్చునని ఎస్‌జీఎఫ్ కన్వీనర్ అడపా రామకృష్ణ తెలిపారు.
- **నరసాపురం టౌన్ :** తిరుపతి పవిత్రను కాపాడాలంటూ సోమవారం పట్టణంలో హిందూ సంస్థల ఆధ్వర్యంలో రుస్తుంబాద శ్రీవారి ఆలయం నుంచి పట్టణ వీధుల మీదుగా ర్యాలీ నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

మానవత్వంతో ముందుకు..

వరద బాధితులకు విరాళాల వెల్లువ

భీమవరం టౌన్, సెప్టెంబరు 22 : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మానవత్వంతో ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజయ సాయి ఇన్ఫ్రా కూనపరెడ్డి వేంకటప్రసాద్ (నవుడూరు ప్రసాద్) రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కూనపరెడ్డి సతీష్, కోళ్ల అబ్బులు, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, కోళ్ల ఫణి, టీడీపీ పండు, రావూరి నాగ భూషణం, బర్రె నెహ్రూ, విజ్జురోతి రాఘవులు, చిక్కాల వెంకటేశ్వరావు, చల్లా రాము, రాంబాబు పాల్గొన్నారు.

● తణుకు : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు చర్చిల ఆధ్వర్యంలో చెక్కు అందజేశారు. పట్టణంలోని వీరభద్రపురంలో ఉన్న బేతేల్ అసెంబ్లీ హాల్, జీడీపీఎఫ్ చర్చిలు సంయుక్తంగా రూ. 2 లక్షల చెక్కును సీఎం సహాయనిధికి అందజేశారు.

● భీమవరంటౌన్ : భీమవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధికి సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ భీమవరం తరఫున రూ.51,116 ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. కార్యక్రమంలో మెంబర్ మేళం దుర్గా ప్రసాద్, మట్లపూడి సత్యనారాయణ, బోణం పాండు రంగారావు, తాళ్ళపూడి గాంధీ, పెన్మెత్స రామక్రృష్ణంరాజు, దిరిశాల సత్యనారాయణ మూర్తి, కట్రెడ్డి సత్యనారాయణ, సీహెచ్ఆర్ వీవీ నాయుడు, ఇంటి లక్ష్మణరావు, వీరా రామయ్య, ఇనుకొండ పాండురంగారావు, కడియం ఈశ్వర రావు కొళ్ల నాగబాబు పాల్గొన్నారు. బిల్డర్ కె.నాగేంద్ర రూ.25 వేలను ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు.

● పాలకొల్లు : వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి తాటిపాక వేదా విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి అత్తోట వెంకట సాయి సాంబశివరవికుమార్ రూ.50వేల చెక్కును మంత్రి కార్యాలయంలో ఆదివారం మంత్రి నిమ్మల రామానాయుడుకు అందించారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల రవి కుమార్‌ను అభినందించారు.

● ఆచంట : ఆచంట వేమవరం గ్రామస్థుల ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళం లక్షా 38 వేల 250 చెక్కును ఆదివారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ద్వారా ఇన్‌చార్జి తహసీల్దార్‌కు అందజేశారు.


ఎమ్మెల్యే అంజిబాబుకు లక్ష రూపాయల చెక్కు అందిస్తున్న నవుడూరు ప్రసాద్


తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లికి రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న దాతలు


ఎమ్మెల్యే పితాని ద్వారా విరాళం చెక్కును తహసీల్దార్‌కు అందజేస్తున్న దాతలు

జడ్పీటీసీ ఉప్పలపాటి సురేశ్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, గుడాల లక్ష్మి దుర్గ,బీకే, కనపాల వెంకటేశ్వరావు, ఎంపీడీవో పినరసింహ ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ సుగుణ సంధ్య పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపు మేరకు ఆదివారం పలువురు స్థానిక జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టికి విరాళాలు అందజేశారు. దండగర్ర సర్పంచ్ పిల్ల రాంబాబు, గిరిబాబు రూ. 50 వేలు, వెన్నులవాడ విశ్వనాథరాజు, ఇందుకూరి రామరాజు, కొలనువాడ గోపాలకృష్ణరావు, వి.శివరాజు రూ. 30 వేలు అందజేశారు.


వరద బాధితులకు నూతన వస్త్రాలు తరలిస్తున్న సీపీఎం కార్యదర్శి బలరామ్ తదితరులు

రూ.2 లక్షల విలువైన నూతన వస్త్రాల తరలింపు

గణపవరం : విజయవాడ వరద బాధితులకు గణపవరం, పిప్పర గ్రామాల్లోని సీపీఎం ఆధ్వర్యంలో బట్టల షాపుల యాజమానుల నుంచి సేకరించిన చీరలు, దుప్పట్లు, తదితర నూతన వస్త్రాలను ఆదివారం విజయవాడకు తరలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం ఆధ్వర్యంలో విజయవాడకు రెండు వాహనాల్లో ఈ నూతన వస్త్రాలను తరలించారు. సీపీఎం నాయకుడు దండు రామలింగరాజు, గోవిందు, శ్రీనివాస్, రాళ్ళపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.


భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు విరాళం అందిస్తున్న దాతలు


పాలకొల్లులో మంత్రి నిమ్మలకు రూ.50 వేలు చెక్కు అందిస్తున్న రవికుమార్


తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టికి నగదు అందజేస్తున్న దాతలు


కూటమి అభివృద్ధి పాలన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జి


పేరుపాలెం నార్త్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్


పండితవిల్లూరు సభలో మాట్లాడుతున్న గణపతినీడి రాంబాబు

దేశం మెచ్చేలా 'కూటమి' వంద రోజుల పాలన

ఆచంట, సెప్టెంబరు 22 : రాష్ట్ర ప్రజలకు దేశం మెచ్చేలా కూటమి ప్రభుత్వం వంద రోజులు పాలన అందించిందని, ప్రజల చేత 'ఇది మంచి ప్రభుత్వం' అని చెప్పించుకునే ఘనత కూటమికే దక్కుతుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆచంట వేమవరంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో కనీసం సమస్యలను ధైర్యంగా చెప్పుకునే అవకాశం ప్రజలకు లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఏ సమస్యనైనా ధైర్యంగా చెప్పుకోవచ్చని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. సభకు సర్పంచ్ వచ్చి ఉంటే అధ్యక్ష స్థానం దక్కేదన్నారు. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లను గౌరవించాలని సీఎం సూచించారన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఎమ్మెల్యే సీమంతాలు నిర్వహించారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగు మర్తి సూర్యకుమారి, గుడాల లక్ష్మీదుర్గ, బీకే, కనపాల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ సుగుణసంధ్య పాల్గొన్నారు.

● తణుకు : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం దువ్వలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దువ్వలో గతంలో తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిలో పదో శాతం కూడా వైసీపీ చేయలేదన్నారు. అనంతరం 28 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులకే రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు సాధించిన ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు చిన్న బలుసులమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జితో కలిసి ఆయన పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో సాధించిన అభివృద్ధిపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్నాల రాంపండు, వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, దాట్ల జగన్నాథరాజు, గుండుమోగుల సురేష్, నల్లగంచు రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ రవి తదితరులు పాల్గొన్నారు.

● మొగల్తూరు : సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనులు చేసి చూపించే ప్రభుత్వమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. ఆదివారం పేరుపాలెంనార్త్ గ్రామంలో సర్పంచ్ పేరుపాలెం వెంకన్న ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, జనసేన మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి, బీజేపీ నాయకులు మామిడిశెట్టి నర్సింహరావు, ఈవోఆర్డీ నవీన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● భీమవరం ఎడ్యుకేషన్ : రాష్ట్రం అభివృద్ధి దిశగా తీసుకువెళ్లేలా ప్రభుత్వం పని చేస్తుందని ఇది మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. లోసరి గ్రామంలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, బుద్దటి వెంకటేశ్వరరావు, రామకృష్ణ, మేకా శ్రీనివాస్, నాగిడి ముత్యాలరావు, బొడ్డు మోహన్, నాగిడి తాతాజీ పాల్గొన్నారు.

● ఉండి : ప్రజల సంక్షేమం కోసం పనిచేసే సీఎం చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు అన్నారు. ఆదివారం వెలివర్రులో తెలుగుదేశం కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి మంచి ప్రభుత్వం బ్రోచర్‌ను అందించి వివరించారు. అలయ కమిటీ మాజీ ఛైర్మన్ మంతెన రంగరాజు దంపతులకు బ్రోచర్‌ను అందించారు. గ్రామ సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం:ఐదేళ్ళపాటు వైసీపీ దుర్మార్గ పాలన చవిచూసిన రాష్ట్రం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిత్వంలో ఊపిరి పీల్చుకుంటుందని ఏలూరు జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు అన్నారు. మల్లపురాజు పేటలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభ జరిగింది. మాజీ సర్పంచ్ యాళ్ళ కల్యాణి, నక్కా ఆనందరావు, విగ్నేశ్వరరావు, రంగబాబు పాల్గొన్నారు.

● పోడూరు : పండితవిల్లూరు సచివాలయం వద్ద ఆదివారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతినీడి రాంబాబు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సభ నిర్వహించారు. సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక అధ్యక్షత వహించారు. జిన్నూరులో జరిగిన సభలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు మాట్లాడారు. సర్పంచ్ జమ్ము బేబీమహాలక్ష్మి, నాయకులు దాసరి రత్నరాజు, పాలవలస తులసీరావు, బీవీ.సత్యనారాయణరాజు, నామాల శ్రీనివాసు, నామాల ఫణీంద్ర, సదమళ్ల బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లుఅర్బన్ : పాలకొల్లు పట్టణంలోని 6వ వార్డులో కూటమి నాయకులు పర్యటించి, నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామానాయుడు చేస్తున్న అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా వివరించారు. మాజీ కౌన్సిలర్ జగ్గరోతు రాంబాబు, టీడీపీ వార్డు ప్రెసిడెంట్ దేవత రామారావు, కార్యదర్శి కొల్లు కళ్యాణ్ చక్రవర్తి, సాధికార మిత్ర బండారు పద్మ, తాడి ఉమామహేశ్వరి, ముత్యాలపల్లి మావుళ్ళమ్మ, జనసేన నాయకుడు టి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తా


మాట్లాడుతున్న హరికుమార్‌రాజు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు, 22 : కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షత పదవి చేపట్టి తొలిసారిగా పాలకొల్లు వచ్చిన సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క పెన్షన్ తప్ప మిగిలిన హామీలు అమలు చేయకపోవడంతో ఈనెల 25న భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సమావేశంలో కొలుకులూరి అర్జునరావు, నాయకులు బోనం వెంకట్రావు, ముడకల గోపాలరావు, రుంకాని శ్రీనివాసరావు, వర్దనపు కాసు, గోడి మోహన్‌రావు, వై. మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు 8 గ్రాముల బంగారం బహూకరణ

భీమవరంటౌన్, సెప్టెంబరు 22 :శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి ఆత్రేయపురానికి చెందిన హర్షవర్మనాగ సాయిలిఖిత దంపతులు ఎనిమిది గ్రాముల బంగారం కానుకగా అందజేశారు. దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదం శేషవస్త్రం అందించారు.

లేసు పార్కు ఎన్నికలు వాయిదా

నరసాపురం రూరల్, సెప్టెంబరు 22: లేసు పార్కు ఎన్నికలు ఈనెల 24న జరగాల్సిన నేపథ్యంలో వాయిదా వేశామని పార్కు మేనేజర్ కుసుమ కుమారి తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించాలన్నదానిపై పీడీ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు..

ఏచూరి, ఆర్ఎస్‌లకు ఘన నివాళులు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు, 22 : ఇటీవల మరణించిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత రుద్రరాజు సత్యనారాయణరాజులకు సీపీఎం, ఎస్ఎఫ్ఐ, అనుబంధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. స్థానిక సమత మహిళా భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాలకొల్లు ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు డి.అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. మాజీ కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సమాజంలో వారి సేవలను కొనియాడారు. తొట్టెంపూడి కోటేశ్వరరావు, యర్ర అజయ్ కుమార్, చల్లా సోమేశ్వరరావు, తాళాబత్తుల అప్పాజీ, కె కన్నబాబు, జె సత్యనారాయణ, జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



ఆకివీడు, భీమవరంలో అన్నసమారాధనలు

ఘనంగా అన్నసమారాధనలు

ఆకివీడు, సెప్టెంబరు 22 :వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అఖండ అన్నసమారాధనలు జరిగాయి. స్థానిక సాలిపేట, శాంతినగర్‌లోని వినాయక దేవాలయాల ఆధ్వర్యంలో నిర్వాహకులు అఖండ అన్నసమారాధనలు నిర్వహించారు.

● భీమవరంటౌన్/భీమవరం అర్బన్ సెప్టెంబరు 22 : వినాయక చవితి 19వ వార్షికోత్సవ సందర్భంగా భీమవరం, నరసయ్య అగ్రహారం, నాలుగో వార్డులోని గరువు వీధి నందు, అమ్మ ఫ్రెండ్స్ సర్కిల్ వారు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సతీమణి భూపతిరాజు ప్రవీణ అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమెను సత్కరించారు. అల్లూరి శివరామరాజు, విన్నకోట వినాయక్, కొత్తపల్లి శ్రీనివాసరావు, తోట గంగరాజు, దాసరి సునీల్ తదితరులు పాల్గొన్నారు. భీమవరం పట్టణంలోని 14వ వార్డులోని ముత్యవారితోటలో మావుళ్ళమ్మ శ్రీరామబాలభక్త శ్రీమణికంఠ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీగణపతి స్వామి వారి 14వ వార్షిక మహోత్సవం సందర్భంగా మద్దుల రాము కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ మెరగాని నారాయణమ్మ పాల్గొన్నారు.

● పెనుగొండ, పోడూరు : పెనుగొండ మండలం పెనుగొండ, సిద్ధాంతం పలు గ్రామాల్లో కమిటీల ఆధ్వర్యంలో గణనాథులను ప్రత్యేకంగా పచ్చిపూలతో అలంకరించి సంప్రదాయ వాయిద్యాలు, బుట్టబొమ్మలతో గ్రామోత్సవం నిర్వహించారు. పవిత్ర సిద్ధాంతం వశిష్ఠ గోదావరిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. పోడూరు మండలం పెనుమదం పెద్దచెర్వు గట్టు వద్ద భారీ మట్టి వినాయకుడిని ఆదివారం గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం నిర్వహించారు. పెనుమదం శ్రీఅభయాంజనేయస్వామి యూత్ ఆధ్వర్యంలో వినాయకుడిని గ్రామోత్సవం నిర్వహించి అనంతరం వశిష్ఠ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

స్వచ్ఛత పాటించడం మన బాధ్యత


రైల్వే స్టేషన్‌లో శుభ్రం చేస్తున్న దృశ్యం

భీమవరంటౌన్, సెప్టెంబరు 22 : స్వచ్ఛత జీవత గమనానికి భద్రత అని, స్వచ్ఛత పాటించడం మన బాధ్యత అని టౌన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం రైల్వే శాఖల ఆధ్వర్యంలో చీపురు పట్టుకుని ప్లాట్ ఫామ్ను శుభ్రపరిచే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ మహాత్మాగాంధీ ఆశయాలకు అను గుణంగా స్వచ్ఛత హీ సేవ, స్వచ్ఛ భారత్, స్వచ్ఛత సర్వేక్షన్ అనే నినాదంతో పరిశుభ్రతపై ప్రవేశపెట్టిన పథకాలు దేశ వ్యాప్తంగా ప్రజాచైతన్యానికి స్ఫూర్తినిస్తున్నాయన్నారు. అనంతరం రైల్వే ఏఈ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ అర్జి, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సరిపిడకల రామారావు, కార్యదర్శి జానపాటి మధు సుధన్ రావు, వేలూరి వెంకటరామయ్య, అరసవల్లి సుబ్రహ్మణ్యం, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఐరన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

పెనుగొండ, సెప్టెంబరు 22 : పెనుగొండ డి.ఐరన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కుడిపూడి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా నందం వెంకటకృష్ణారావు, ఉపాధక్షుడిగా నౌడు దుర్గారావు, కార్యదర్శి దొడ్డిపట్ల రాంబాబు, సమతం సత్యనారాయణ, దొడ్డిపట్ల శివను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎమ్మెలే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్ సంఘానికి కావాల్సిన సహాయ సహకారాలు అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అగ్రరాజ్యంగా భారత్.. అదే మోదీ సంకల్పం

ఉండి, సెప్టెంబరు 22: ప్రధాని మోదీ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉండడం వల్లే మూడోసారి ప్రధానిగా ఎన్నికయ్యారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు అన్నారు. ఆదివారం ఉండిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రరాజ్యంగా చేయాలనేది ప్రధాని మోదీ ప్రత్యేక సంకల్పమన్నారు. ఈమేరకు నిరంతరం అభివృద్ధిపై దృష్టి పెట్టి పనిచేస్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు యర్రా విక్రమ్, సూర్యప్రకాశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, జిల్లా ఇన్‌చార్జి పేరిచర్ల సుభాష్, ఉండి అసెంబ్లీ ఇన్‌చార్జి అల్లూరి సాయిరాజు, కోరా రామ్మూర్తి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, నాగమణి, నాగబాబు పాల్గొన్నారు.


బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు

ఉండి సెప్టెంబరు 22: వైసీపీ నుంచి పలువురు నాయకులు బీజేపీలో చేశారు. ఆదివారం ఉండిలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉద్దరాజు గాంధీరాజు, ఉండి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఉద్దరాజు వెంకటసుబ్బరాజు, వీరవాసరం మండలం నేలపోగుల సర్పంచ్ భర్త వేగేశ్న నరసింహరాజు, యిర్రింకి శివన్నారాయణ, పైల రవికుమార్‌నాయుడు, ప్రగడ రమణ, గొట్టుముక్కల భాస్కరరాజు తదితరులు పార్టీలో చేరారు. వీరిని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి విశ్వనాధరాజు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి కండువాలు వేశారు. బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు యర్రా విక్రమ్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యం, ఆనందం డబ్బుతో కొనలేం

పెనుమంట్ర, సెప్టెంబరు 22 : ఆరోగ్యం, ఆనందం డబ్బుతో కొనలేం ధ్యానంతోనే సాధ్యమని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమాచంద్ అన్నారు. ఆదివారం పెనుమంట్ర గ్రామంలో భూపతిరాజువెంకట శ్రీనివాసరాజు, సాయిగీతచే నిర్మించిన పితామహ పత్రీజీ పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద పిరమిడ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక ధ్యానం చేయించారు జిల్లా అధ్యక్షుడు రుద్రరాజు పెద్దివర్మ, మాట్లాడుతూ వచ్చే నెల రెండో తేదీన గాంధీ జయంతి సందర్భంగా భీమవరం పట్టణంలో నిర్వహించే అహింసా-శాంతి సద్భా వనా శాకాహార ర్యాలీకి అందరూ రావాలని పిలుపు నిచ్చారు. జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, సుబ్బారాయుడు, శ్రీనివాస్ మాస్టర్ మధు కె.మోహన్‌కుమార్ సాయిబాబా, మంతెన లక్ష్మి, సత్యవతి, పార్వతి పాల్గొన్నారు.

రక్తదానంపై యువకుల్లో అవగాహన పెరగాలి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు చినబాబు

భీమవరంటౌన్, సెప్టెంబరు 22 : రక్తదానంపై యువకుల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అన్నారు. భీమవరం బేతని పేట వరల్డ్ మిషన్ సొసైటీ చర్చి ఆఫ్ గాడ్ ఆధ్వర్యంలో 1,564వ రక్తదాన శిబిరాన్ని స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 నుంచి 30 ఏళ్ల యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. చర్చ్ ఆఫ్ గాడ్ భీమవరం శాఖ బ్రాడ్లీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఒక్కరోజే 150 మంది రక్తదానం చేశారని అన్నారు. తొలుత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, కార్యదర్శి సుంకర రవి, ఉపాధ్యక్షుడు పత్తి హరవర్ధన్, రెడ్ క్రాస్ సొసైటీ రామబద్రిరాజు, బంక అనిల్‌కుమార్, సూర్య పి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశువుల దాణా అందజేత

యలమంచిలి, సెప్టెంబరు 22: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం గ్రామాల్లో పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 680 బ్యాగులు పశువుల దాణాను ఎన్డీఏ కూటమి నాయకులు అందజేశారు. కార్యక్రమాల్లో మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి, మామిడిశెట్టి పెద్దిరాజు, పీతల శ్రీను, చెరుకూరి అంజిబాబు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.